

ఎన్నికల ఫిర్యాదులకు కాల్ సెంటర్ ఏర్పాటు

పాడేరు, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల్లో అక్రమాలు, ఇతర సమస్యలపై తమకు ఫిర్యాదు చేసేందుకు కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిబంధనల అతిక్రమణ, అక్రమ డబ్బు, మద్యం రవాణా, పంపిణీతో పాటు ఓటర్లను ప్రలోభపెట్టడడం వంటి వాటిపై ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ప్రజలు ఎన్నికల సంబంధిత సమస్యలపై 08935 299912, 08935 299934, 08935 293448 ఫోన్ నంబర్లకు ఫిర్యాదులు చేయవచ్చునని కలెక్టర్ పేర్కొన్నారు.

జ్వరాల విజృంభణ



ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వర బాధితులతో నిండిన వార్డులు

ప్రతి రోజు 300 నుంచి 350 మందికి చికిత్స



ఏరియా ఆస్పత్రిలో జ్వరబాధితులతో నిండిన వార్డులు

చింతపల్లి, ఏప్రిల్ 6: **గిరిజన గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. వాతావరణంలో కలిగిన మార్పుల వల్ల మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాల బారిన పడి అధిక సంఖ్యలో గిరిజనులు చికిత్స కోసం ఆస్పత్రికి వస్తున్నారు. ప్రతి రోజు 300 నుంచి 350 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం జ్వర బాధితులతో వార్డులు నిండిపోయాయి.**

సాధారణంగా ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు గిరిజన ప్రాంతంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. ప్రస్తుతం వేసవి కావడంతో పలు గిరిజన గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో జ్వర బాధితులు అధిక సంఖ్యలో ఆస్పత్రికి వస్తున్నారు. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో ఉన్న 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు కొయ్యూరు, జి.మాడుగుల సరిహద్దు గ్రామాల ఆదివాసీలు చికిత్స కోసం చింతపల్లి ఏరియా ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ప్రతి గిరిజన గ్రామంలో ముగ్గురు, నలుగురు జ్వరాలతో బాధపడుతున్నారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నెలకు 15 ప్రత్యేక వైద్యశిబిరాలను వైద్యులు ఏర్పాటు చేసేవారు. పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యుల్లో ఒకరు గ్రామాల్లోకి వెళ్లి ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తే, మరో వైద్యాధికారి ఆస్పత్రిలో అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడం లేదు. ఆరోగ్య సురక్ష పేరిట ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నప్పటికి రోగుల నుంచి స్పందన లేదు. సాధారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనున్న గిరిజన గ్రామాల్లో జ్వరాలు ప్రబలితే ఆశ కార్యకర్త ద్వారా సమాచారం తెలుసుకుని వెంటనే వైద్యాధికారి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్స అందించాలి. ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు, గ్రామాల్లో వ్యాధులు ప్రబలితే రోగులు ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి. గిరిజనులు వ్యాధి సోకిన వెంటనే ఆస్పత్రికి వచ్చే పరిస్థితి లేదు. తొలుత గ్రామంలో అందుబాటులో ఉండే పసర మందులు, నాటు వైద్యాన్ని ఆశ్రయించి వ్యాధి తగ్గకపోతే ఆస్పత్రికి వస్తున్నారు. దీంతో వ్యాధి తీవ్రమై కొన్ని సందర్భాల్లో ప్రాణాలను కోల్పోయే పరిస్థితి ఎదురవుతున్నది.

సరిహద్దు గ్రామాల్లో వ్యాధులు

ప్రస్తుతం కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి సరిహద్దు గ్రామాల్లో వ్యాధులతో ఆదివాసీలు బాధపడుతున్నారు. ఎర్రచెరువుల, తూరిమామిడి, అగ్రహారం, కుంకుమపూడి, మాడెం, సిరిబాల గ్రామాల్లో జ్వరాలు అధికంగా ఉన్నాయి. సరిహద్దు గ్రామాల ప్రజలకు సకాలంలో మెరుగైన చికిత్స అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు గతంలో మాదిరిగా వ్యాధులు ప్రబలిన గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పెరుగుతున్న మలేరియా, టైఫాయిడ్ బాధితులు

ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల్లో అధిక శాతం మలేరియా, టైఫాయిడ్ బాధితులు ఉంటున్నారు. ఆస్పత్రిలో గత నెలలో 26 మంది టైఫాయిడ్, ఆరుగురు మలేరియా వ్యాధితో ఆస్పత్రికి వచ్చారు. ప్రతి రోజు 20 నుంచి 30 మంది వైరల్ జ్వరాలతో ఆస్పత్రికి వస్తున్నారు. అలాగే రెండు మండలాలోనున్న ప్రతి పీహెచ్‌సీలో నెలలో నాలుగు నుంచి ఐదు మలేరియా, నాలుగు టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. ఏప్రిల్ ప్రారంభంలోనే టైఫాయిడ్, మలేరియా రోగుల సంఖ్య పెరగడంతో జూన్, జూలై, ఆగస్టులో వ్యాధుల తీవ్రత మరింతగా పెరిగే అవకాశమున్నది. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి గిరిజన గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన రోగులు

పాడేరులో యూత్ ట్రైనింగ్ సెంటర్

కేంద్రం నిధులు రూ.50 లక్షలతో భవన నిర్మాణం

గతంలో ఉన్న వైటీసీలో కలెక్టరేట్ ఏర్పాటు

నూతన భవనం పూర్తయితే వృత్తి నైపుణ్య శిక్షణలకు పూర్వ వైభవం



పాడేరులో నిర్మిస్తున్న యూత్ ట్రైనింగ్ సెంటర్ భవనం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణలు అందించేందుకు గాను జిల్లా కేంద్రం పాడేరులో యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు. ఐటీడీఏకు కేంద్ర ప్రభుత్వం అందించే కేంద్ర ప్రత్యేక సహాయ పథకం నుంచి రూ.50 లక్షల నిధులతో దీనిని నిర్మిస్తున్నారు. మరో ఆరు నెలల్లో నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తుందని అధికారులు అంటున్నారు.

గతంలో ఉన్న వైటీసీలోనే కలెక్టరేట్ ఏర్పాటు

పాడేరు శివారున కుమ్మరిపుట్టు ప్రాంతంలో 2012లో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పసుపులేటి బాలరాజు రూ.4 కోట్ల వ్యయంతో యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మించారు. దీంతో గిరిజన నిరుద్యోగులకు సంబంధించిన అన్ని రకాల వృత్తి విద్యా నైపుణ్య శిక్షణలను అందులోనే నిర్వహించే వారు. అలాగే అధికారులు, ఉద్యోగులకు సంబంధించిన పలు శిక్షణ కార్యక్రమాలను యూత్ ట్రైనింగ్ సెంటర్‌లోనే నిర్వహించేవారు. ఆఖరుకు కొవిడ్ సంభవించినప్పుడు 50 పడకల కొవిడ్ కేర్ సెంటర్‌ను ఇందులోనే నిర్వహించారు. దీంతో స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్ బహుళ ప్రయోజనకారిగా అందుబాటులో ఉండేది. అయితే 2022 ఏప్రిల్‌లో పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు శ్రీకారం చుట్టడడంతో యూత్ ట్రైనింగ్ సెంటర్‌లోనే కలెక్టరేట్ సముదాయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో అప్పటి నుంచి అక్కడే కలెక్టరేట్ కొనసాగుతున్నది. ఈ తరుణంలో జిల్లా కేంద్రంలో యూత్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు అవసరమనే వాదన బలంగా వినిపించేది.



ప్రస్తుతం కలెక్టరేట్ కొనసాగుతున్నది ఇక్కడే..

కేంద్రం నిధులతో కొత్తగా వైటీసీ భవన నిర్మాణం

గతంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను కలెక్టరేట్‌కు కేటాయించడంతో స్థానికంగా మరో యూత్ ట్రైనింగ్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకు రావాలని జిల్లా పూర్వపు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ భావించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఐటీడీఏలకు అందించే కేంద్ర ప్రత్యేక సహాయ నిధుల్లోంచి రూ.50 లక్షలను అందుకు కేటాయించారు. ఆయా నిధులతో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖకు చెందిన స్థలంలో ఆ భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. మరో ఆరు నెలల్లో భవన నిర్మాణ పూర్తయి అందుబాటులోకి వస్తుందని అధికారులు అంటున్నారు. నూతన యూత్ ట్రైనింగ్ సెంటర్ పూర్తిగా అందుబాటులోకి వస్తే గతంలో వలే గిరిజన నిరుద్యోగులకు వృత్తి విద్య నైపుణ్య శిక్షణలు, ఇతర ఉచిత కోచింగ్‌లు ఇచ్చేందుకు ఎంతో ఉపయోగపడుతుందని నిరుద్యోగులు అంటున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఎటువంటి ట్రైనింగ్ సెంటర్ లేకపోవడంతో నైపుణ్య శిక్షణలు అంతగా జరగని పరిస్థితి నెలకొంది. కొత్త ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి వస్తే నైపుణ్య శిక్షణలకు పూర్వ వైభవం వస్తుందని గిరిజన నిరుద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న ఎండ తీవ్రత

జి.మాడుగులలో గరిష్ఠ ఉష్ణోగ్రత 36.5 డిగ్రీలు

పాడేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మన్యంలో ఎండల తీవ్ర కొనసాగుతున్నది. దీంతో ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా పెరుగుతున్నాయి. శనివారం జి.మాడుగులలో గరిష్ఠ 36.5, కనిష్ఠ 20.0 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, హుకుంపేటలో 37.4- 19.6, పెదబయలులో 36.9- 19.4, చింతపల్లిలో 38.6- 19.3, పాడేరులో 36.7- 19.0, అరకులోయలో 37.2- 18.6 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనుకోని విధంగా ఏజెన్సీలో సైతం కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం వేగంగా పెరుగుతుండడం విశేషం.

ఏజెన్సీలో బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం

పాడేరు వచ్చే ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు కట్ కావడమే కారణం

పాడేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పాడేరులో శనివారం పగలంతా భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) సేవలకు అంతరాయం కలిగింది. దీంతో సెల్, ఇంటర్నెట్ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. ఉదయం ఎనిమిదిన్నర గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పాడేరుతో పాటు జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో బీఎస్ఎల్ఎల్ సేవలు బంద్ అయ్యాయి. మైదాన ప్రాంతం నుంచి పాడేరు మెయిన్ టెలిఫోన్ ఎక్ఛేంజీకి వచ్చే ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు అటు చోడవరం, ఇటు నర్సీపట్నానికి సమీపంలో కట్ కావడమే ఇందుకు కారణమనిబీఎస్ఎస్ఎల్ అధికారులు తెలిపారు. రోజంతా బీఎస్ఎన్ఎల్ టెక్నికల్ సిబ్బంది శ్రమించి తెగిన ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లను అతికించడంతో సాయంత్రం నాలుగు గంటలకు సేవలు అందుబాటులోకి వచ్చాయి.

ఐసీడీఎస్‌కు సొంత గూడు కలేనా?

పూర్తికాని నూతన భవనం నిర్మాణం

శిథిల రేకుల షెడ్డులో ఉద్యోగుల అవస్థలు

వర్షానికి రికార్డులు తడిసిపోతుండడంతో ఇబ్బందులు

పట్టించుకోని పాలకులు, అధికారులు

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 6: **ఐసీడీఎస్ మండల ప్రాజెక్టు కార్యాలయానికి నూతన భవనం అందుబాటులోకి రాక పోవడం వల్ల ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం పరాయి పంచన శిథిల రేకుల షెడ్డులో కార్యాలయాన్ని నిర్వహించుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. కార్యాలయం నిర్వహిస్తున్న రేకుల షెడ్డు వర్షాలు కురిస్తే కారిపోతుంది. అయినా తప్పని సరి పరిస్థితుల్లో రేకుల షెడ్డులోనే ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ కాలం నెట్టుకొస్తున్నారు.**



అసంపూర్తిగా ఉన్న ఐసీడీఎస్ నూతన భవనం

చింతపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న జీకేవీధి మండలాన్ని 2013లో విడదీసి నూతన ఐసీడీఎస్ ప్రాజెక్టును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జీకేవీధి ఐసీడీఎస్ ప్రాజెక్టుకి కొత్త భవనం అందుబాటులో లేకపోవడం వల్ల అప్పట్లో రెవెన్యూ కార్యాలయాల సముదాయంలో పాడుబడిన ఒక రేకుల షెడ్డును కేటాయించారు. ఐసీడీఎస్ అధికారులు భవనం పైకప్పుబాగుచేసుకుని, గోడలకు రంగులు వేసుకుని కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఐదేళ్ల కిందట జీకేవీధి ఐసీడీఎస్ కార్యాలయానికి నూతన భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.53 లక్షల నిధులను మంజూరుచేసింది. భవనం నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖకు అప్పగించింది. నిర్మాణ బాధ్యతలను టెండర్ ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టరు తొమ్మిది నెలల్లో పూర్తిచేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐసీడీఎస్ కార్యాలయ నూతన భవనం శ్లాబ్ వరకు నిర్మించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.53 లక్షల నిధుల్లో దాదాపు 95 శాతం నిధులు సంబంధిత కాంట్రాక్టరు డ్రా చేసుకున్నారు. అయితే భవనం నిర్మాణ పనులను ఇప్పటి వరకు పూర్తి చేయలేదు.



ప్రస్తుతం ఐసీడీఎస్ కార్యాలయం నిర్వహిస్తున్న పాత రెవెన్యూ భవనం

వర్షమొస్తే ఇబ్బందులు

మూడేళ్ల కిందట ఐసీడీఎస్ కార్యాలయం నూతన భవన నిర్మాణాన్ని కాంట్రాక్టరు అసంపూర్తిగా వదిలేసినా అధికార పార్టీ ... మిగతా 8వ పేజీలో



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా, తదితరులు

జిల్లాలో త్వరలో ఎన్నికల పరిశీలకుల పర్యటన

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

గ్రామ వలంటీర్ల వ్యవస్థ స్థితిగతులపై ఆరా

పాడేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పరిశీలకులు త్వరలో పర్యటిస్తారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో అమరావతి ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలు తీరు పక్కాగా ఉండాలని, అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టి సీజ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న గ్రామ వలంటీర్ల సంఖ్య, వారి రాజీనామాలు, తొలగింపులు తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. జిల్లాలోని చెక్ పోస్టుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాలని, ప్రజాప్రతినిధుల భద్రతకు ప్రభుత్వ వాహనాలు వినియోగించకూడదన్నారు. అలాగే సీజర్లు, ఎంసీసీ అతిక్రమణ, సీ విజిల్, పోలింగ్ స్టేషన్ల మ్యాపింగ్ తదితర అంశాలపై అధికారులు చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, ఎన్నికల నోడల్ అధికారి సువర్ణఫణి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.15
సహరి (సోమ)	4.30

సప్పర్ల రెయిన్‌గేజ్ వద్ద అడవులు ఆహుతి

అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్

సీలేరు, ఏప్రిల్ 6: జీకేవీధి మండలం సప్పర్ల రెయిన్‌గేజ్ అటవీ ప్రాంతంలో అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయి. అడవులు కాలిబూడిద అవుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేసవిలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని అంటున్నారు. ఈ ప్రాంతంలో అడవులు దగ్ధం కావడానికి ఆకతాయిల పనా?, లేక పోడు వ్యవసాయం కోసం ఎవరైనా అడవులకు నిప్పు పెడుతున్నారా? అనేది తెలియడం లేదు. అడవులు దహనమై దట్టమైన పొగ రావడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి అడవులను సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.



సప్పర్ల రెయిన్‌గేజ్ ప్రాంతంలో చెట్లు కాలి బూడిదైన దృశ్యం



అడవులు దగ్ధంతో సీలేరులో కమ్ముకున్న పొగ

నేడు అనకాపల్లిలో పవన్ కల్యాణ్ పర్యటన

వారాహి వాహనంపై రోడ్డు షో



అనకాపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం అనకాపల్లి రానున్నారు. సాయంత్రం 3.30 గంటలకు హెలికాప్టర్‌లో అనకాపల్లి డైట్ కళాశాల సమీపంలో గల ఒక ప్రైవేటు లేఅవుట్‌లో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి రింగ్‌రోడ్డులో గల ఎన్టీఆర్ విగ్రహం కూడలి, చేపలబజారు, చిన్న నాలుగురోడ్ల కూడలి, కన్యకాపరమేశ్వరి జంక్షన్, వేల్పుల వీధి మీదుగా నెహ్రూచౌక్ జంక్షన్ వరకూ వారాహి వాహనంలో రోడ్డుషో నిర్వహిస్తారు. నాలుగు గంటలకు నెహ్రూచౌక్ కూడలిలో వారాహి వాహనం మీద నుంచి ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

క్రైం... crime news

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మీరాజు (ఫైల్)

సబ్బవరం, ఏప్రిల్ 6 : మండలంలోని జాతీయ రహదారిపై సున్నం బట్టీలు వద్ద శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎలమంచిలికి చెందిన తీటకాలి లక్ష్మీరాజు(48) పెందుర్తిలోని ప్లైవుడ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈయన భార్య, పిల్లలతో పురుషోత్తపురం వద్ద నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం స్వగ్రామానికి బైక్‌పై వెళ్లి తిరిగి రాత్రి పెందుర్తి వెళుతున్నాడు. జాతీయ రహదారి సున్నంబట్టీలు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వాహన చోదకులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య జ్యోతి సంతోషికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమణ తెలిపారు. కాగా లక్ష్మీరాజుకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

590 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్పీ, పోలీస్ సిబ్బంది

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 6: రోలుగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా 590 కిలోల గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా అందిన సమాచారం మేరకు రోలుగుంట పోలీసులు దాడి చేసి రోలుగుంట మండలం ఎం.పెదపేట గ్రామానికి చెందిన కొడమ నాగరాజు, కె.కోటపాడు మండలం ఆర్లి గ్రామానికి చెందిన నంబారు రాజు, రోలుగుంట మండలం వెలమకాయల గ్రామానికి చెందిన కాశీరాజుల వద్ద 590 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.30.4 లక్షలు ఉంటుందన్నారు. నిందితులను అరెస్టు చేసి, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. ఈ అక్రమ రవాణాకు ఎక్కడి నుంచి ప్రారంభమైంది.. ఎక్కడకు చేరుతుందన్న అంశంపై లోతుగా దర్యాప్తు ప్రారంభించామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న రోలుగుంట, రావికమతం పోలీసులను ఎస్పీ అభినందించారు.

కంటైనర్‌లో తరలిస్తున్న 51 పశువుల పట్టివేత

▸▸ ముగ్గురు అరెస్టు



అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని సీతారాంపురం జాతీయ రహదారిపై కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 51 పశువులను పట్టుకుని డ్రైవర్, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎస్. జోగారావు తెలిపారు. ముందస్తు అందిన సమాచారం మేరకు సీతారాంపురం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా తుని వైపు వెళుతున్న కంటైనర్‌ను తనిఖీ చేయగా 51 పశువులను పట్టుకున్నామన్నారు. పశువులను వెంకోజీపాలెంలోని గో సంరక్షణ కేంద్రానికి తరలించినట్టు తెలియజేశారు. డ్రైవర్, మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు.

పెదరాంభద్రపురం హత్య కేసులో మరొకరు అరెస్టు

▸▸ అరెస్టు అయిన వ్యక్తి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన వలంటీరు

పాయకరావుపేట, ఏప్రిల్ 6: మండలంలోని పెదరాంభద్రపురంలో ఈ ఏడాది జనవరిలో జరిగిన హత్య కేసులో మరొక వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఈ ఏడాది జనవరి 11వ తేదీన మండలంలోని పెదరాంభద్రపురంలో అదే గ్రామానికి చెందిన సీలి నూకరాజు అనే వ్యక్తి అంబేద్కర్,జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద కూర్చునే గట్టు మీదకు చెప్పులతో ఎక్కాడు. అలా చెప్పులతో ఎక్కకూడదని అక్కడే ఉన్న గంపల నూకరాజు(బుజ్జి) చెప్పడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం ఒక పథకం ప్రకారం మారణాయుధాలతో జరిగిన దాడిలో తీవ్రగాయాలైన గంపల నూకరాజు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అప్పట్లో 13 మంది నిందితులను అరెస్టు చేశారు. శనివారం మరొక నిందితుడు పాయకరావుపేట రాజీవ్ నగర్ కాలనీకి చెందిన వలంటీరు పెద్దాడ గాంధీని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 : పట్టణంలో 12 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి దర్జీకాలనీకి తీసుకువెళుతున్న కె.దుర్గారావును అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ హెచ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. రింగురోడ్డులో దుర్గారావు వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు లభించాయన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఖైదీ పరారీ

▸▸ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

విశాఖపట్నం ఏప్రిల్ 6: చికిత్స కోసం కేజీహెచ్‌లో చేర్పించిన ఖైదీ తప్పించుకొని పారిపోయాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి శనివారం వన్‌టౌన్ సీఐ భాస్కర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవుకు చెందిన బొమ్మిడి మహాలక్ష్మి అలియాస్ రాజు (24)పై మూడు కేసుల్లో నేరం రుజువు కావడంతో 2022 జూన్ నుంచి విశాఖ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. మూడు రోజుల కిందట జైలులో మేకులు, వైర్ ముక్కలు తినడంతో జైలు అధికారులు కేజీహెచ్‌కు తరలించారు. ఇక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి రాజేంద్రప్రసాద్ వార్డులో ఇన్‌పేషెంట్‌గా ఉంచారు. అతడికి శస్త్రచికిత్స చేయాల్సి రావడంతో శుక్రవారం రాత్రి సూపర్ స్పెషాలిటీ వార్డుకు తరలించారు. ఆ సమయంలో వాష్ రూమ్‌కు వెళ్లాలని చెప్పడంతో జైలు గార్డు తీసుకువెళుతుండగా, అతడిని బలవంతంగా తోసి పరారయ్యాడు. హఠాత్పరిణామంతో కంగుతిన్న గార్డు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెల్లడించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

నేటి నుంచి నూకాంబిక కొత్త అమావాస్య జాతర

▸▸ నెల రోజులపాటు నిర్వహణ

▸▸ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

▸▸ 400 మంది పోలీసులతో రెండు షిఫ్టుల్లో బందోబస్తు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6: ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఆదివారం రాత్రి నుంచి ప్రారంభం కానుంది. నెల రోజులు పాటు జరిగే జాతర సందర్భంగా ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు అమ్మవారికి ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర పర్యవేక్షకురాలు, దేవదాయ శాఖ డీసీ సుజాత ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆది, మంగళ, గురువారాలతోపాటు మిగిలిన రోజుల్లో కూడా ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి, ఖరగ్‌పూర్, బిలాయి ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి కుటుంబసమేతంగా భక్తులు వచ్చి మొక్కుబడులు తీర్చుకుంటారు. భక్తులు ఎండ వేడిన పడకుండా ఉండేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భారీ ఎత్తున క్యూలైన్లు సిద్ధం చేశారు. ఆదివారం రాత్రి ప్రారంభమయ్యే అమ్మవారి దర్శనం తెల్లవార్లు ఉంటుందని చెబుతున్నారు. ప్రతీయేటా ఫాల్గుణ బహుళ అమావాస్య నుంచి చైత్ర బహుళ అమావాస్య వరకు నెల రోజుల పాటు అమ్మవారి జాతర అత్యంత వైభవంగా జరుపుతారు.

భారీ బందోబస్తు..

నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా ఆలయం వద్ద, పరిసర ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పట్టణ సీఐ జి. శంకరరావు తెలిపారు. షిఫ్టుకు 200 మంది ఎస్ఐ నుంచి హోంగార్డు వరకు రెండు షిఫ్టుల్లో 400 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తుకు సిద్ధం చేశామని తెలిపారు.అంతేకాకుండా ముఖ్యమైన కూడళ్ల వద్ద సిబ్బందిని



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

ఏర్పాటు చేస్తున్నామని, మఫ్టీలో కూడా పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

పార్కింగ్ స్థలాలు..

ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వాహనాలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్టు ట్రాఫిక్ సీఐ వి.పైడపునాయుడు తెలిపారు. జాతీయ రహదారి మీదుగా అమ్మవారి ముఖద్వారం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే వాహనచోదకులకు జాతీయ రహదారిలోని కొబ్బరితోట, పెట్రోల్‌బంకు పక్కన, పక్కనే ఉన్న మరో కొబ్బరితోటలో వాహనాల పార్కింగ్‌కు సిద్ధం చేశామన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, ఫూల్‌బాగ్ రోడ్డు మీదుగా వచ్చే భక్తులకు భాష్యం స్కూల్ వద్ద, నూకాంబిక ఆలయం సమీపంలోని కొబ్బరితోట, విశాఖ ఫైనాన్స్ భవనం వద్ద పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశామన్నారు.

భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా చర్యలు

- ఈవో బండారు ప్రసాద్

జాతర సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేశాం. భక్తులకు స్నానాల గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా తయారుచేసి సిద్ధం చేశాం. క్యూలో ఉన్న భక్తులకు చల్లటి తాగునీరందిస్తాం. అమ్మవారి దర్శనానికి రూ.100లు, రూ.50లు క్యూలైన్లను సిద్ధం చేశాం. 26న మూలవిరాట్ దర్శనం కల్పించేందుకు పనులు వేగవంతం చేస్తున్నాం.



ఆలయంలో ఆవరణలో వేసిన చలువ పందిళ్లు

పదేళ్లలో మోదీ చేసిన అభివృద్ధిని వివరించండి

▸▸ బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో అనకాపల్లి పార్లమెంట్ నియోజవర్గం బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్

నర్సీపట్నం, ఏప్రిల్ 6 : పదేళ్ల పాలనలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన దేశాభివృద్ధిని గడప గడపకు వెళ్లి వివరించాలని అనకాపల్లి పార్లమెంట్ నియోజవర్గం బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ పిలుపు నిచ్చారు. శనివారం రాత్రి ఒక్కడ ఏర్పాటైన బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 264 బూత్ కమిటీలు మండలాల వారీగా విభజించి బీజేపీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక, రాక్షస పాలన పోవాలంటే బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉమ్మడిగా పనిచేయాలని సూచించారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో అవినీతి పాలన సాగుతుందన్నారు. తప్పు జరిగినప్పుడు మాట్లాడాల్సిన అవసరం ఉందని, చాలా మంది కేసులకు భయపడి మాట్లాడడం లేదని వాపోయారు. రాష్ట్రానికి జరుగుతున్న నష్టాన్ని వివరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మద్యం దుకాణాల మీద అప్పు తెచ్చిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే అని ఎద్దేశా చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, దేశం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు కలిసి పనిచేయాలని



బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన పాకలపాటి అరవింద్ కుమార్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ నాయకులు వెలగా జనార్దన్, కాళ్ళ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఈ సమావేశం జరుగుతున్న కృష్ణా పేలస్ గదిలో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. మీటింగ్‌లో చీరలు పంపిణీ చేస్తున్నారని అందిన సమాచారంతో ఎన్నికల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా తొమ్మిది పాత చీరలు కవర్లలో చుట్టి లభించాయి. మహిళలు బీజేపీ గుర్తుతో ఉన్న చీరలు ధరించి పాత చీరలు గదిలో వదిలేసి ఉంటారని భావిస్తున్నారు. సమావేశం కోసం అనుమతి తీసుకున్న వెలగా జగన్నాథ్‌కు నోటీసు ఇచ్చి వివరణ తీసుకుంటామని రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం తెలిపారు. దీనిపై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, సీఎం రమేశ్ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమం పాడు చేయడానికే ఎవరో ఫిర్యాదు చేస్తే అధికారులు తనిఖీలు చేయడానికి వచ్చారన్నారు.

18 నుంచి అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు

▸▸ ఏర్పాట్లపై ఈఓ శ్రీనివాసమూర్తి సమావేశం

సింహాచలం, ఏప్రిల్ 6 : వరాహలక్ష్మీనృసింహుని వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఈనెల 18న అంకురార్పణతో ప్రారంభం కానున్నట్టు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో తిరు కల్యాణ మహోత్సవాలతో పాటు మే 10న జరిగే స్వామి వారి నిజరూప దర్శనం నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన శ్రీసుదర్శన నారసింహ మహా యజ్ఞం విజయవంతం కావడంతో అదే స్ఫూర్తితో ఈనెల 18 నుంచి 24 వరకు జరిగే తిరు కల్యాణోత్సవాలను కూడా విజయవంతం చేయాలని చెప్పారు. ముఖ్యంగా భక్తులకు తాగునీరు, అన్నప్రసాదం, ఆలయ పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు. అలాగే ప్రథమ చికిత్స కేంద్రాలు, అత్యవసరాలకు అందుబాటులో అంబులెన్స్‌లు, పారామెడికల్ సిబ్బంది, మందులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైదికపరంగా జరగాల్సిన ఎదుర్కోలు ఉత్సవం, రాథోత్సవం, కల్యాణ వేదిక ఏర్పాటు, కల్యాణం నిర్వహణ, రథసారధికి ఆహ్వానం, విద్యుత్ దీపాలంకరణ, దాతలకు ఆహ్వాన పత్రికలు పంపడం వంటి అనేక అంశాలపై ఈఓ



సిబ్బందితో సమావేశమైన ఈఓ శ్రీనివాసమూర్తి

అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో దేవాలయం స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు వెంకట రమణాచార్యులు, ఏఈఓలు నక్క ఆనందకుమార్, పాలూరి నరసింగరావు, నరసింహరాజు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలతో ఎండుతున్న రిజర్వాయర్లు

▸▸ ఏడారిని తలపిస్తున్న ఊటగెడ్డ రిజర్వాయర్

▸▸ ఆందోళన చెందుతున్న రైతులు

మాకవరపాలెం, ఏప్రిల్ 6 : ఎండలు మండిపోతున్నాయి. వేసవి పూర్తిస్థాయిలో ఆరంభం కాకముందే భానుడు ప్రతాపాన్ని చూపుతున్నారు. సాగునీటి వనరులు సైతం కొన్నిచోట్ల ఎండిపోతున్నాయి. ఇప్పటికే మండలంలోని చినరాచపల్లి గ్రామంలో ఉన్న ఊటగెడ్డ రిజర్వాయర్ ఎండిపోయింది. ఈ ప్రాంత రైతులు, పశువులకు వేసవిలో ఈ రిజర్వాయర్ నీరు ఎంతో ఉపయోగపడేది. గత ఏడాది రిజర్వాయర్ గెట్లు మరమ్మతుకు గురికావడంతో ప్రస్తుతం చుక్క నీరు లేకుండా



వేసవి ఆరంభంలోనే ఎండిపోయిన మామిడిపాలెం రిజర్వాయర్



ఊటగెడ్డ రిజర్వాయర్ దుస్థితి

పోయిందని చెపుతున్నారు. అలాగే మామిడిపాలెం రిజర్వాయర్‌లో పూడికతీత పనులు చేపట్టక పోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీరు వచ్చినట్టే బయటకు పోవడంతో రిజర్వాయర్‌లో చుక్కనీరు కనిపించని దుస్థితి నెలకొంది. వేసవి ఆరంభంలోనే ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఏమిటని రైతులంతా ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం ముందుగా స్పందించి రిజర్వాయర్ గేట్లను బాగుచేయించి, పూడిక తీయిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు పేర్కొంటున్నారు.

పింఛన్‌దారుల మృతి ప్రభుత్వ వైఫల్యమే

▸▸ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



విలేకరులతో మాట్లాడుతున్న బాబ్జీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 6 : రాష్ట్ర ప్రభుత్వ పాలనా వైఫల్యం కారణంగానే రాష్ట్రంలోని 33 మంది పింఛన్‌దారులు కన్నుమూశారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను పక్కదోవ పట్టించి సీఎస్ జవహర్ రెడ్డి ముఖ్యమంత్రికి అనుకూలంగా వ్యవహరించారన్నారు. పింఛన్‌దారులను కావాలనే కిలోమీటరు దూరం నడిపించారనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయన్నారు. సీఎస్ ప్రజల పక్షాన ఆలోచించకపోవడం విచారకరమన్నారు. 40 డిగ్రీల ఉష్ణోగ్రత బయట ఉంటే వృద్ధులు సచివాలయాలకు ఎలా వెళ్లగలుగుతారని ప్రశ్నించారు. సచివాలయాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చిన రూ. ఎనిమిది వేల కోట్లను మళ్లించిన ప్రభుత్వంపై పంచాయతీరాజ్ సమాఖ్య నేటికి పోరాడుతున్నదన్నారు. వచ్చే మే నెల ఒకటి, రెండు తేదీల నాటికి సీఎస్ పింఛన్‌దారుల ఇంటికి పింఛన్లు అందించే ఏర్పాట్లు చేయలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుడు కొలసాని రమణ, రైతు ప్రతినిధి పెంటకోట వరప్రసాద్, సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

రోలుగుంట, ఏప్రిల్ 6: మండలంలోని కుసర్ల పూడి గ్రామానికి చెందిన గొల్లు ఎర్రమ్మ (70) వడ దెబ్బకు గురై మృతిచెందినట్టు ఆయన కుటుంబ సభ్యులు, వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ మద్దు అప్పలనాయుడు తెలిపారు. వారు అందించిన వివరాల ప్రకారం...ఎర్రమ్మ శుక్రవారం పెన్షన్ తీసుకోవడానికి సచివాలయానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా ఎండ వేడికి తట్టుకోలేక కళ్లు తిరిగి పడిపోయారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో వెంటనే ఇంటికి తీసుకువెళ్లి సపర్యలు చేశారు. శనివారం ఇంటి వద్దనే స్థానిక వైద్యుడు వైద్యం అందించినా ఫలితం లేక పోయింది. చికిత్సపొందుతూ మృతిచెందారు. ఎర్రమ్మకు భార్య కొండమ్మ, కుమారుడు రాజుబాబు ఉన్నారు. రాజుబాబు పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు.

రూ.2.8 లక్షల నగదు సీజ్

విశాఖపట్నం, ఏప్రిల్ 6: చినవాల్తేరు మెంటల్ ఆసుపత్రి రోడ్డులో శనివారం రాత్రి ఓ మహిళ కారులో రూ.2,80,500 నగదుతో ప్రయాణిస్తుండగా ఫ్లైయింగ్ స్క్వాడ్, త్రీ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. కణితి స్పందన ప్రపూర్ణ యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆమె రాత్రి కారులో నగదుతో వెళ్తున్నారు. విషయం తెలుసుకున్న స్క్వాడ్ మెంటల్ ఆసుపత్రి రోడ్డులో కారు నిలిపి తనిఖీ చేయగా నగదు లభ్యమైంది. నగదుకు సంబంధించి ఆమె ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేశారు. చినవాల్తేరు ఓల్డ్ సీబీఐ రోడ్డులో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

మాకవరపాలెం, ఏప్రిల్ 6: జిల్లాలో వలంటీర్ల రాజీనామాల పరంపర కొనసాగుతోంది. మాకవర పాలెం మండలంలో మాకవరపాలెం, జి.కోడూరు, జిగంగవరం సచివాలయాలకు చెందిన 40 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో చంద్రరావుకి అందజేసి ఆమోదించాలని కోరారు.

గొలుగొండ మండలంలో..

గొలుగొండ: మండలంలోని పలు సచివాల యాలకు చెందిన 69 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. మండలంలోని కృష్ణాదేవిపేటలో 10 మంది, ఏఎల్.పురం గ్రామంలో 13 మంది, రావణాపల్లి, కొమిర గ్రామాల్లో 16 మంది, జోగంపేటలో 13 మంది, చిన్నయ్యపాలెంలో ఐదుగురు, జోగంపేటలో 12 మంది ఆయా గ్రామ కార్యదర్శులకు రాజీనామా పత్రాలు అందజేశారు.

జైతవరంలో ఆరుగురు..

చీడికాడ: మండలంలోని జైతవరం గ్రామానికి చెందిన ఆరుగురు గ్రామ వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు.

మాసాహెబ్‌పేటలో 16 మంది..

పాయకరావుపేట రూరల్: మండలంలోని మాసాహెబ్‌పేట గ్రామానికి చెందిన 16 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో కె.స్వప్నకు అందజేశారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దొన్నుదొర

కేడర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా..

- అరకు అసెంబ్లీ టికెట్‌పై అధిష్ఠానం పునరాలోచించాలి
- టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

అరకులోయ, ఏప్రిల్ 6: పార్టీ శ్రేణుల నిర్ణయానికి కట్టుబడి ముందుకు సాగుతానని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర పేర్కొన్నారు. పద్మాపురం సమీపంలో ఓ రిసార్ట్‌లో శనివారం నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రా కదలిరా సభలో పార్టీ అధినేత చంద్రబాబు తనకు టికెట్ ప్రకటించడంతో అంతా సంతోషించామన్నారు. తరువాత బీజేపీ అభ్యర్థి పేరును ఖరారు చేయడంతో నిరాశ చెందామన్నారు. మాట కూడా చెప్పకుండా అధిష్ఠానం తనను మార్పు చేయడం విచారకరమన్నారు. ఈ నిర్ణయంతో తనతో పాటు కుటుంబ సభ్యులు, కేడర్ కూడా ఎంతో బాధపడ్డారని వాపోయారు. ఈ క్రమంలో కుటుంబంతో ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నామని, అయితే కేడర్ ఇచ్చిన భరోసాతోనే ధైర్యంగా ఉన్నామని దొన్నుదొర పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ కార్యదర్శి లోకేశ్‌ను కలిసి మాట్లాడగా, పొత్తులో భాగంగా తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీకి అరకు టికెట్‌ను ఇవ్వాల్సి వచ్చిందని చెప్పారని, తనకు ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చారని దొన్నుదొర తెలిపారు. అయినప్పటికీ అరకు టికెట్ విషయంలో పార్టీ అధిష్ఠానం పునరాలోచించాలని కోరారు. ఏదేమైనా కేడర్ నిర్ణయమే తనకు శిరోధార్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చర్మ వ్యాధుల నివారణకు ప్రత్యేక వైద్యం

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్



బాలికలకు మందులు అందిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల చర్మ వ్యాధుల నివారణకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) వి.అభిషేక్ తెలిపారు. ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శనివారం శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో చర్మ వ్యాధులతో బాధపడుతున్న బాలికలకు అవసరమైన సబ్బులు, ఆయింట్‌మెంట్లు, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా గత నెలలో పాడేరు, హుకుంపేట మండలాలల్లో పది ఆశ్రమ పాఠశాలలో చర్మ వ్యాధులపై ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. ఆయా పాఠశాల్లో 60 నుంచి 70 మంది విద్యార్థులకు చర్మ సంబంధ సమస్యలు ఉన్నాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏజెన్సీ వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలల్లో చర్మ వ్యాధుల నివారణ చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదించి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తామని పీవో తెలిపారు. గిరిజన విద్యార్థులకు చర్మ వ్యాధులు రాకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, చర్మ వ్యాధుల నిపుణులు లక్ష్మి, సరోజ, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం మంజుల పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడు వైవీని కలిసిన ఎమ్మెల్యే

పాడేరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త, రాజ్యసభ సభ్యుడు వైవీ.సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శనివారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైవీ.సుబ్బారెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా విశాఖపట్నం వచ్చిన సందర్భంగా కలిశామని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ టి.నరసింగరావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై ఆయన ఆరా తీశారని చెప్పారు.

కొమ్మికలో అగ్ని ప్రమాదం

- రెండు పూరిళ్లు, ఐదు ఎకరాల్లో జీడిమామిడి తోట దగ్ధం



గ్రామంలో కాలిబూడిదైన గృహాలు

కొయ్యూరు, మార్చి 6: మండలంలోని కొమ్మిక గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు కాలిపోయాయి. అలాగే ఐదు ఎకరాలలో పూత పిందెతో ఉన్న జీడిమామిడి తోట దగ్ధమైంది. గ్రామానికి ఆనుకుని ఉన్న చేనులో శుక్రవారం సాయంత్రం చెలరేగిన మంటల కారణంగా కర్రి నూకాలమ్మ, గోరా భూపతికి చెందిన పూరిళ్లు కాలిబూడిదయ్యాయి. వీటికి సమీపంలోనే ఉన్న గోరా నానాజీకి చెందిన మూడు ఎకరాల జీడిమామిడి తోట, గోరా కృష్ణకు చెందిన మరో రెండు ఎకరాల జీడిమామిడి తోటలకు మంటలు విస్తంచి దగ్ధమయ్యాయి. మొత్తం ఐదు ఎకరాల్లో పూత, పిందెతో తోట కాలిపోయింది. దీంతో సుమారు రూ.5 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదంతో సర్వం కోల్పోయి బాధిత కుటుంబాల వారు భోరున విలపిస్తున్నారు. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే ఆడాకులు పంచాయతీలోని కిష్టారం గ్రామంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పేగు చిన్నమ్మలకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయారు.

ఆదివాసీలు స్వేచ్ఛగా ఓటు వేయాలి



బలపంలో ర్యాలీ చేస్తున్న గిరిజనులు, సెక్టోరల్ అధికారి

చింతపల్లి, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో ఆదివాసీలు పోలింగ్ కేంద్రాలకు వచ్చి స్వేచ్ఛగా ఓటు వేయాలని బలపం సెక్టోరల్ అధికారి శ్రీనివాసరావు సూచించారు. బలపం పంచాయతీ కేంద్రంలో మన ఓటు-మన భవిష్యత్ కార్యాక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటు ప్రాముఖ్యతపై ఆదివాసీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన నాయకులను ఎన్నుకునేందుకు ఓటు చాలా విలువైందన్నారు. ఇందుకోసం అర్హులంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని ఆయన చెప్పారు.

26 నుంచి నిరుద్యోగ యువతకు శిక్షణ

తుమ్మపాల (అనకాపల్లి), ఏప్రిల్ 6: భారతీయ స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి, అల్లూరి జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఈనెల 26 నుంచి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నామని సంస్థ డైరెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. 30 రోజులు పాటు టూ వీలర్ మెకానిక్, హౌస్ వైరింగ్‌పై శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు సెల్‌నంబరు 8008333509ను సంప్రదించాలని కోరారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి ఐక్యంగా పనిచేద్దాం

- టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానేశ్వరి



మాట్లాడుతున్న జ్ఞానేశ్వరి, పక్కన ఉమ్మడి అభ్యర్థి కిల్లు రమేశ్ నాయుడు

చింతపల్లి, ఏప్రిల్ 6: పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థుల విజయానికి ఐక్యంగా పనిచేద్దామని టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శనివారం పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కిల్లు రమేశ్ నాయుడు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కేంద్రంలో మోదీ పీఎంగా, రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపడతారన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులు కొత్తపల్లి గీత, రమేశ్‌నాయుడును గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గిరిజన గ్రామాల అభివృద్ధి పదేళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇందులో భాగంగా గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించే బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని రద్దు చేసినట్టు చెప్పారు. ఆదివాసీలు తాగునీరు, విద్య, వైద్యం కోసం నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సమస్యలను కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకువెళ్లి ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు చల్లంగి లక్ష్మణరావు, కూడ కృష్ణారావు, జైతి ప్రభాకరరావు, ఉల్లి సీతారామ్, శెట్టి నాగేశ్వరరావు, బొండ్ల చిరంజీవి, వసుపరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జి.మాడుగుల నాయకులతో మాట్లాడుతున్న రమేశ్‌నాయుడు

టీడీపీ విజయం ఖాయం: రమేశ్‌నాయుడు

జి.మాడుగుల: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ గెలుపు ఖాయమని పార్టీ అభ్యర్థి కిల్లు వెంకటరమేశ్‌నాయుడు చెప్పారు. మండల కేంద్రంలో శనివారం నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సమష్టిగా పనిచేసి తనను గెలిపించాలని కోరారు. తాను గెలిచాక అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు సోమెలి చిట్టిబాబు, ఎస్.నాగబ్బాయి, ఎం.మత్స్యరాజు, ఎం.రామరాజు, క్రిష్టారావు, బాలయ్యదొర, కల్యాణం, పిన్నయ్యదొర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధారాలమ్మ కలశ స్థాపన



అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న భక్తులు... (ఇన్‌సెట్‌లో) ధారాలమ్మ అమ్మవారు

సీలేరు, ఏప్రిల్ 6: గిరిజనుల ఆరాధ్య దైవం దారకొండ దారాలమ్మ అమ్మవారి 58వ వార్షిక మహోత్సవాల సందర్భంగా శనివారం అమ్మవారి కలశ స్థాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 8వ తేదీన కొత్తఅమావాస్య సందర్భంగా అమ్మవారి ప్రధాన పండుగను నిర్వహిస్తామని, అదే రోజు భక్తులు అమ్మవారి మొక్కులను తీర్చుకుంటారని ఆలయ ఈవో సాంబశివరావు తెలిపారు. అమ్మవారి ప్రధాన పండుగ రోజున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. శనివారం నుంచి అమ్మవారి ఆలయం వద్ద వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అలాగే ఉత్సవాలు జరిగే ఐదు రోజుల పాటు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

నూకాలమ్మ గరగాలంకరణ

సీలేరు జల విద్యుత్ కేంద్రం వద్ద నూకాలమ్మ అమ్మవారి గరగ అలంకరణ కార్యక్రమం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నూకాలమ్మ ఉత్సవాల్లో భాగంగా సీలేరు జల విద్యుత్ కేంద్రం వద్ద అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి గరగను అలంకరించి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో సీలేరు, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు నీడ కరవు

- మండుటెండలో పనులు చేస్తున్న ఆదివాసీలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

డుంబ్రిగుడ, ఏప్రిల్ 6: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు నీడ కరువైంది. మండలంలోని చాలా గ్రామాల్లో కూలీలు మండే ఎండల్లోనే పనులు చేయాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో కూలీలు పడరాని పాట్లు పడుతున్నారు. ఎండ తీవ్రతతో సొమ్మసిల్లి పడిపోవాల్సిన ప్రమాదం ఏర్పడుతుందని వారు భయాందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయంలో పని ప్రదేశాల్లో కూలీలకు నీడనిచ్చే టార్పాలిన్లు, మందుల కిట్లు పంపిణీ చేశారని, ఈ ఐదేళ్లలో కూలీలకు భరోసా లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కూలీల శ్రేయస్సు కోసం పని ప్రదేశాల్లో నీడను ఇచ్చేందుకు టార్పాలిన్లను పంపిణీ చేయాలని వారు వేడుకుంటున్నారు.

సంతలో చింతపండు కొనుగోలు కేంద్రం

- పిక్కతో కిలో రూ.32... పిక్కలేకుండా రూ.63 ధర నిర్ణయించిన గిరిజన సహకార సంస్థ

హుకుంపేట, ఏప్రిల్ 6: మండలంలో గిరిజన సహకార సంస్థ చింతపండు కొనుగోలు ప్రక్రియను ప్రారంభించింది. మండల కేంద్రంలో ప్రతీ శనివారం జరిగే వారపు సంతలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కిలో చింతపండు కొనుగోలు ధర రూ.32గా నిర్ణయించినట్టు ఈ సందర్భంగా జీసీసీ ఇన్‌చార్జి కేబీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది 150 కింటాళ్ల చింతపండు కొనుగోలు చేస్తామని చెప్పారు. సంతలోని దళారీలు, వ్యాపారులు తూకంలో మోసగిస్తారని చెప్పారు. తూకంలో ఎటువంటి మోసాలు లేకుండా పిక్కతో కిలో రూ.32, పిక్క లేకుండా రూ.63కు కొనుగోలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే చింతపండు కొనుగోలుపై గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సేల్స్‌మెన్‌కు సూచించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు చింతపండు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీసీసీ సిబ్బంది కళావతి, రామన్న, బాలరాజు పాల్గొన్నారు.



హుకుంపేట వారపు సంతలో ఏర్పాటు చేసిన చింతపండు కొనుగోలు కేంద్రం ఇదే..

ఆధారాలు లేని రూ.73,500 సీజ్

సబ్బవరం,ఏప్రిల్ 6 : జాతీయ రహదారి మర్రిపాలెం చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.73,500 నగదును ఎస్ఎస్ టీమ్(స్టాటిస్టికల్ సర్వేలెన్స్) పట్టుకొని సీజ్ చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసి ఎస్ఎస్ టీమ్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనకాపల్లికి చెందిన ఐస్‌క్రీమ్ వ్యాపారి బొలేరో వాహనం పెందుర్తి నుంచి అనకాపల్లి వెళుతుందన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.73,500 నగదు దొరికిందన్నారు. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని, ఆధారాలు చూపించి నగదును తీసుకెళ్లవచ్చునని సీఐ రమణ తెలిపారు.

రాత్రి వేళ విద్యుత్ కోతలతో జనం అవస్థలు

రోలుగుంట, ఏప్రిల్ 6: బ్రేక్ డౌన్ పేరుతో రాత్రి తొమ్మిది నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు విద్యుత్ కోతలు విధిస్తుండడం ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ చార్జీలను తీవ్రంగా పెంచి పేదల నడ్డి విరుస్తున్న పాలకులకు, వారికి నాణ్యమైన విద్యుత్‌ను అందించాల్సిన బాధ్యత లేదా సీపీఎం నేత కె.గోవిందరావు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు.



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

- 300 మందికి వైద్య సేవలు

కొయ్యూరు, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కేబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో కంటి రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్న సుమారు 300 మంది బాధితులు వైద్య సేవలు పొందారు. శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య నిపుణులు గీతాంజలి, చాందిని రోగులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేబీ ఫౌండేషన్ చైర్మన్ కన్నబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని మారుమూల కొండలపైగ్రామాలలో గిరిజనులు కంటి సంబంధ సమస్యలతో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేబీ ఫౌండేషన్ ప్రతినిధులు దుడ్డు సత్యనారాయణ, ఏసుబాబు, కిల్లో బాబూరావు, దేపూరి కూర్మారావు, మర్రి అర్జునరెడ్డి శంకర్ ఫౌండేషన్ మేనేజర్ చంద్రశేఖర్, ఎంపీపీ బడుగు రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు సొంత గూడు కలేనా?


... 5వ పేజీ తరువాయి

ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులు కనీస పట్టించుకోకపోవడం వల్ల నేటికి సొంత గూడుకి నోచుకోలేదు. నాలుగేళ్లగా సొంత భవనం కోసం ఐసీడీఎస్ ఉద్యోగులు ఎదురుచూస్తూ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాడుబడిన షెడ్డులో సదుపాయాలు లేక సూపర్‌వైజర్లు నేలపై కూర్చోవాల్సి వస్తోంది. ఇక వర్షాకాలం భవనం పైకప్పు నుంచి వర్షపు నీరు కారిపోతోంది. దీంతో కార్యాలయం రికార్డులు తడిసిపోతున్నాయి. దీని వల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన సరకులు పాడైపోకుండా టార్పాలిన్లు కప్పి జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు.

పట్టించుకోని పాలకులు, అధికారులు

గూడెంకొత్తవీధి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నూతన భవనం పూర్తి చేసేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. నిర్మాణ బాధ్యతలు పొందిన కాంట్రాక్టరు 95 శాతం నిధులను డ్రా చేసుకుని పనులను అర్థాంతరంగా నిలిపివేసినా అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన భవనాన్ని పూర్తిచేస్తే నాటి ప్రభుత్వ నాయకులకు పేరు వస్తుందనుకున్నారో, ఐసీడీఎస్ కార్యాలయానికి నూతన భవనం అక్కరలేదనుకుంటున్నారో తెలియదుగాని అసంపూర్తి భవనం పూర్తి చేసేందుకు కనీసం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి భవనం సమస్య



ఇటీవలే సీడీపీవోగా బాధ్యతలు స్వీకరించా. ఇప్పటికే గత సీడీపీవో అసంపూర్తి భవనం పరిస్థితి, ప్రాజెక్టు కార్యాలయానికి శాశ్వత భవనం అందుబాటులో లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మరోసారి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకు వెళతాం.

-ఎ.లక్ష్మీదేవి, సీడీపీవో, గూడెంకొత్తవీధి

సంక్షిప్తంగా..

వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు

చింతపల్లి, ఏప్రిల్ 6: సీజనల్ వ్యాధులపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.చంద్రశేఖరరావు సూచించారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు వైరల్, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ డయేరియా తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. సాధారణంగా ప్రతి ఏటా ఎపిడమిక్ సీజన్‌లో ఏరియా ఆస్పత్రిలో 300-350 ఓపీ వస్తుందన్నారు. ప్రస్తుతం మలేరియా అదుపులోనే ఉందన్నారు. జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు కచ్చితంగా చేయించుకోవాలని చెప్పారు. వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు. అలాగే కాచి ఒడబోసిన నీటినే తాగాలని, పెంపుడు జంతువులను ఆహారంగా తీసుకోకూడదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. తరచూ చేతులను శుభ్రం చేసుకోవడం చాలా మంచిదన్నారు. ప్రతీ కుటుంబం దోమతెరలను వినియోగించాలని ఆయన సూచించారు. అలాగే నాటు వైద్యం, పసర మందులకు దూరంగా ఉండాలని ఆమె వివరించారు.

ఉమ్మడి అభ్యర్థుల ప్రచార మండల అధ్యక్షుడిగా పిన్నయ్యదొర

జి.మాడుగుల, ఏప్రిల్ 6: కూటమి ఉమ్మడి అభ్యర్థుల ప్రచార మండల అధ్యక్షుడిగా టీడీపీ సీనియర్ నేత కొండపల్లి పిన్నయ్యదొర ఎన్నికయ్యారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కిల్లు వెంకట రమేశ్‌నాయుడు గెలుపే లక్ష్యంగా శనివారం ఇక్కడి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నుకున్న కమిటీలో ప్రధాన కార్యదర్శిగా జనసేన నుంచి ఎం.భీమన్న, సలుగు సతీశ్ బీజేపీ, వీరితో పాటు మరో ఆరుగురు నాయకులను సభ్యులు ఎన్నుకున్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ నిరంకుశ పాలనకు ఎండగడుతూ, గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, మూడు పార్టీల నాయకులు ఎస్.నాగబ్బాయి, కె.కల్యాణం, బి.బాబూరావు, ఎల్.బాలయ్యదొర, లక్ష్మయ్య, కొండలరావు, జనసేన నాయకులు మురళి, నూకరాజు, గంగప్రసాద్, బీజేపీ నేతలు రామునాయుడు, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు నివారణకు ఆదివాసీలు సహకరించాలి

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 6: అడవుల్లో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు ఆదివాసీలు సహకరించాలని బీట్ అధికారి మండి భూషణం కోరారు. తోకచిలుక గ్రామంలో అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అడవుల్లో చెట్ల నుంచి ఆకులు రాలిపోతుంటాయన్నారు. దీంతో వేటకు, అటవీ ఫలసాయం సేకరణ కోసం వెళ్లిన సమయంలో ఎక్కడా నిప్పుపెట్టరాదని సూచించారు. వన్య ప్రాణులను వేటాడడం నేరమన్నారు. వేసవిని అధిగమించేందుకు మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

పెదబయలు, ఏప్రిల్ 6: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ మనోజ్‌కుమార్ సూచించారు. జామిగూడ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలు సజావుగా జరగటానికి ప్రజలు పూర్తి స్థాయిలో అధికారులకు సహకారం అందించాలని కోరారు. ఓటు హక్కు పొందిన ప్రతీ పౌరుడు తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆయా గ్రామాల యువకులకు వాలీబాల్ కిట్లు, గ్రామస్థులకు మందులు పంపిణీ చేశారు.

ముస్లింలకు నిత్యావసర సరకులు

చింతపల్లి, ఏప్రిల్ 6: మండల కేంద్రంలో పేద ముస్లిం కుటుంబాలకు శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. బియ్యం, ఆయిల్, కూరగాయాలు, పప్పు తదితరల వస్తువులు అందించారు. ఈ సందర్భంగా సామగ్రి సమకూర్చిన ఎస్కే ఉమర్ మాట్లాడుతూ అల్లా బోధనలు అనుసరిస్తూ వ్యక్తిగత నిధులతో పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

జి.మాడుగుల, ఏప్రిల్ 6: మండలంలోని మద్దిగరువు రహదారి పులుసుమామిడి ఘాట్‌లో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పెదబయలు మండలం కొరవంగి గ్రామానికి చెందిన కొందరు కొయ్యూరు మండలం తమ బంధువల ఊరు నుంచి ఆటో వాహనంలో వస్తూ పులుసుమామిడి ఘాట్‌లో ఆటో ఆదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కొరవంగి గ్రామానికి చెందిన కేబీఎం రాజు, బాలరాజు, ఎస్.రవిజేజ, ఎస్.కుమారి, కె.బాలక్రిష్ణకు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు 108 వాహనంతో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

జి.మాడుగుల, ఏప్రిల్ 6: గిరిజన ప్రాంత హక్కులు పరిరక్షించే సీపీఎం అభ్యర్థులకు ఓటేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొనంగి చిన్నయ్యపడాల్ కోరారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో ఖనిజ సంపదను అదానీకి కట్టబెట్టిన బీజేపీ, వాటి కూటమి అభ్యర్థులను ఓడించాలని కోరారు. జీవో నంబరు-3 రద్దు, గిరిజన చట్టాల ఉల్లంఘిస్తున్న పార్టీలకు ఓట్లు ద్వారా బుద్ధి చెప్పాలని పలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయలు కె.కోటిబాబు, బి.దర్మయ్యదొర, సత్తిబాబు, పి.సన్యాసిదొర, భాషా వలంటీర్ల సంఘం నేత సర్బునాయుడు పాల్గొన్నారు.

అధ్వానంగా రాములు రహదారి



రాళ్లు తేలిపోయిన రాములు గ్రామ రహదారి

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 6: కించాయిపుట్టు పంచాయతీ రాములు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. సుమారు మూడు కిలోమీటర్ల రోడ్డు పలుచోట్ల దెబ్బతింది. ఎక్కడబడితే అక్కడ గతుకులు, రాళ్లు తేలిపోయాయి. ఫలితంగా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గతుకలను తప్పించుకుంటూ వెళ్లాలంటే కత్తిమీద సాముగా ఉంటుందని ద్విచక్ర వాహన చోదకులు వాపోతున్నారు.